క్లుప్తంగా

ఉచిత వేసవి బాస్కెట్ బాల్ క్రీడా శిక్షణ



శిక్షణ పొందుతున్న బాల బాలికలతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, పీఈటీలు

అమలాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో మాజీ ఐపీఎస్ అధికారి కుడుపూడి గోపాల కృష్ణ గోఖలే, మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు జ్ఞాపకార్థం ఈ నెల ఒకటో తేదీ నుంచి ఆరంభమైన అండర్-18 ఉచిత వేసవి బాస్కెట్ బాల్ శిక్షణా తరగతుల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పీఈటీలు ఉమ, బుజ్జిలు బాల బాలికలకు క్రీడలో రోజూ తర్ఫీదునిస్తున్నారు. శిక్షణ తరగతులను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సంసాని గంగాధరరావు పర్యవేక్షిస్తున్నారు.

ఎమ్మెల్యే పొన్నాడకు సత్కారం



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న నరసింహరాజు తదితరులు

అమలాపురం టౌన్: జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా పార్టీని విజయపథాన నడిపిస్తున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఎన్నికల్లో మళ్లీ గెలిచి తీరతారని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇందుకూరి నరసింహరాజు ఆకాంక్షించారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే పొన్నాడ ఇంటి వద్ద ఆయనను శనివారం ఉదయం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాట్రేనికోన జెడ్పీటీసీ సభ్యుడు కిషోర్, చెయ్యేరు సూరిబాబు, మహేష్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

సీతకు సేవా రత్న అవార్డు ప్రదానం



సినీ హీరో జేడీ చక్రవర్తి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీత

అమలాపురం టౌన్: హైదరాబాద్‌లో ఈ నెల 2వ తేదీన జరిగిన దాసరి ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవ సభలో పట్టణానికి చెందిన పూర్వపు జిల్లా ఆర్య వైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు యెండూరి సీతకు సినీ హీరో జేడీ చక్రవర్తి చేతుల మీదుగా దాసరి సేవా రత్న అవార్డు ప్రదానం చేశారు. కరోనా సమయంలో రోగులకు ఆక్సిజన్ సిలెండర్లు, కాన్సంటేటర్లు ఉచితంగా అందించిన సేవలకు గాను సీతకు ఈ అవార్డు లభించింది.

పోస్టల్ బ్యాలెట్ సెంటర్ ఏర్పాటు

ముమ్మిడివరం: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, ఇతర సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకునేందుకు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్వో వి.మదన్‌మోహన్‌రావు తెలిపారు. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజవర్గ పరిధిలో ఓటు హక్కు ఉన్నవారు ఈ నెల 5, 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవచ్చన్నారు. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులకు ఈ నెల 7, 8 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకునేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాట్లు చేశారన్నారు.

ఉపాధి కూలీ మృతి



చిరుకూరి సాహెబ్(ఫైల్)

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధి బొండాడిపేటకు చెందిన ఉపాధి కూలీ చిరుకూరి సాహెబ్ (68) శనివారం మృతి చెందారు. ఉపాధి పనికి వచ్చిన ఆయన శనివారం ఉదయం 8.30 గంటలకు సొమ్మసిల్లి పడిపోయి చనిపోయారని ఉపాధి ఏపీవో వి.రాజామణి చెప్పారు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారని స్థానికులు తెలిపారు.

చిన్ననాటి స్నేహితుడికి సాయం

యానాం: ప్రమాదంలో గాయపడిన స్నేహితుడి వైద్యఖర్చులకు చిన్ననాటి మిత్రులు సాయమందించి పెద్ద మనసు చాటుకున్నారు. యానాం మెట్టకూరుకు చెందిన 1989-90 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పంపన దుర్గారావుకు ఇటీవల జరిగిన ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న అతడి చిన్ననాటి స్నేహితులంతా కలిసి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు సేకరించారు. శనివారం వారంతా ఆ మొత్తాన్ని, నిత్యావసరాలను దుర్గారావుకు అందజేశారు.

సొంతింటి కల.. సాకారం..

- రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలు
- జోరుగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు



బోడసకుర్రులోని జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

అమలాపురం టౌన్: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ కనీస అవసరాలైన కూడు, గూడు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పక్కా ఇళ్లు నిర్మించేందుకు ప్రవేశపెట్టిన అందరికీ ఇళ్లు పథకం నిరుపేదల పాలిట వరంలా మారింది. నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పూరి గుడిసెలు, అద్దె ఇళ్లలో ఉంటున్నవారి సొంతింటి కల నెరవేరుతుండడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి.

అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం పట్టణం, రూరల్ మండలం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో 9,254 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వారందరి కోసం ప్రభుత్వం మొత్తం 190 ఎకరాలను సేకరించి జగనన్న లేఅవుట్లుగా తీర్చిదిద్దుతుంది. నియోజకవర్గంలో మొత్తం 71 జగనన్న లేఅవుట్లు తయారవుతున్నాయి. ఇందులో బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయం చెంతన ఏర్పాటైన జగనన్న లేఅవుట్, కాలనీలో కొందరు లబ్ధిదారులు ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని సంతోషంగా జీవిస్తున్నారు. మరి కొందరి ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. అమలాపురం పట్టణంతో పాటు రూరల్ మండలం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో దాదాపు 600 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. మరో 1,200 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. నియోజవకర్గంలో నిర్దేశించిన 71 జగనన్న లేఅవుట్లు, కాలనీలకు సంబంధించి కొన్నింటిలో ప్రస్తుతం భూములను మెరక చేస్తున్నారు. ఆయా లేఅవుట్లలో జగనన్న కాలనీలు రూపుదిద్దుకోగానే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం పూర్తి స్థాయిలో చేపట్టి సొంతింటి కల నెరవేర్చుకోనున్నారు. కొందరు లబ్ధిదారులైతే ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశాలు సైతం పూర్తి చేసుకున్నారు.

ఇంటి స్థలం వచ్చింది



ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలం కోసం ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నాకు దేవగుప్తంలో సొంతిల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చింది. లేఅవుట్ పూర్తయ్యాక జగనన్న కాలనీలో సొంత ఇల్లు నిర్మించుకుంటాం. త్వరలోనే మా కల నెరవేరబోతుంది.

– గంటా దేవి, లబ్ధిదారు, దేవగుప్తం, అల్లవరం మండలం

చాలా సంతోషంగా ఉంది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించిన స్థలంలో సొంతింటిని నిర్మించుకుని అక్కడే నివసిస్తున్నాం. ఎన్నో ఏళ్ల కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉంది. పరాయి పంచన, అద్దె ఇంటిలో ఉండాల్సి దుస్థితి నుంచి తప్పించి సొంతింటివాళ్లను చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– దాసరి భద్రావతి, లబ్ధిదారు, విలసవల్లి, ఉప్పలగుప్తం మండలం

ప్రతి కుటుంబానికీ సంక్షేమంతో భరోసా



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- తూర్పులంక, రెల్లుగెడ్డల్లో ఎన్నికల ప్రచారం



తూర్పులంకలో మంత్రి విశ్వరూప్ సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ కార్యకర్తలు

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీకి సంక్షేమంతో భరోసా కల్పిస్తామని అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని తూర్పులంక, రెల్లుగెడ్డ గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాదరావులను గెలిపించాలని ఓటర్లని అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి తూర్పులంక విచ్చేసిన విశ్వరూప్‌కు మహిళలు అడుగడుగునా మంగళ హారతులిచ్చి స్వాగతం పలికారు. ఎన్నికల ప్రచారంలో టీడీపీకి చెందిన పలువురు కార్యకర్తలు విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి విశ్వరూప్ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆయనకు షుగర్ లెవల్స్ తగ్గి స్వల్ప అస్వస్థతకు గురి కావడంతో గోడిలంక పీహెచ్‌సీ వైద్యాధికారి సుమ వైద్యం అందించారు. దీంతో ఆయన కాస్త కోలుకుని మళ్లీ ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీని గెలిపించాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, సర్పంచ్‌లు కడలి గంగాచలం, నడింపల్లి వాసురాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు గెద్దాడ సింహాద్రి, కాశి సత్యనారాయణ, యలమంచిలి సింహాద్రిప్రసాద్, నడింపల్లి నాగబాబురాజు, ఉల్లింగి శ్రీను, కట్టా శ్రీను, బొంతు సత్యనారాయణ, కడలి సింహాద్రి, గంటా నాగరాజు, బొంతు నాగరాజు, మాకే నరేష్ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



టీడీపీ కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన 20 మంది టీడీపీ కార్యకర్తలు మంత్రి విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, రుద్రరాజు నానిరాజు, అల్లూరి సురేష్ రాజుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలకు మంత్రి విశ్వరూప్ వైఎస్సార్ సీపీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్‌ను వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇందుకూరి నరసింహరావు మర్యాద పూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, టీఏసీ మెంబర్ కుడుపూడి శ్రీను, కృష్ణంరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు కడలి లక్ష్మణరావు, గెద్దాడ జాన్‌తాతారావు, మానేపల్లి సత్తులు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలతో సమావేశం

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల పంచాయతీ శెట్టిబలిజ సామాజికవర్గ ముఖ్య నాయకులతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ శనివారం సమావేశమయ్యారు. ఆదివారం ముమ్మిడివ రం ఎయిమ్స్ కళాశాల గ్రౌండ్‌లో జరగనున్న నియోజకవర్గ స్థాయి శెట్టిబలిజల ఆత్మీయ సమావేశం ఏర్పాట్ల గురించి చర్చించారు.

ప్రతి బాధిత కుటుంబానికీ నష్ట పరిహారం



పల్లంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



ఎమ్మెల్యే పొన్నాడకు ఘన స్వాగతం పలుకుతున్న చిర్రయానం గ్రామస్తులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కాట్రేనికోన మండలంలో ఎన్నికల ప్రచారం

కాట్రేనికోన: చమురు సంస్థలతో పోరాడి పైపులైన్ పనులతో నష్టపోయిన ప్రతి బాధిత కుటుంబానికి నష్ట పరిహారం వచ్చేలా చేశానని టీటీడీ పాలక వర్గ సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పల్లం, నీళ్లరేవు, చిర్రయానం, గచ్చకాయలపోర, మర్రిచెట్టు కాలనీ, ఎంజీఆర్ కాలనీ, నాగ పట్టణం, రాజానగరం తదితర గ్రామాల్లో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా పల్లంలో గ్రామ దేవత ధనమ్మను పొన్నాడ దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడకు మహిళలు మంగళ హారతులిస్తూ, అభిమానులు పూలు జల్లుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లం గ్రామంలో సుమారు రూ.5 కోట్లు ఖర్చుతో రక్షిత మంచి నీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఇంటింటికీ కుళాయిలతో మంచి నీరిస్తున్నామన్నారు. శివారు ప్రాంతాలకు రక్షిత మంచి నీరు అందించింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనన్నారు. అనేక సంక్షేమ పథకాలు అందించిన జగనన్న ప్రభుత్వం మత్స్యకారులకు స్వర్ణయుగమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా మత్స్యకారులందరికీ నష్టపరిహారంతో పాటు మత్స్యకార భరోసా, ఆయిల్ సబ్సిడీ పెంపు, ప్రమాద బీమా వంటి సంక్షేమం పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పల్లం, చిర్రయానం, బ్రహ్మసమేథ్యం సర్పంచులు మల్లాడి బాబ్జి, మల్లాడి ఏడుకొండలు, ఓలేటి మంగాదేవి, పాలెపు ధర్మారావు, కాశి మునికుమారి, తిరుకోటి శాంతి సుధ, కోలాటి సత్యం, కోలా మీరయ్య, ఓలేటి నాగేశ్వరరావు, పాలెపు గంగరాజు, అంగాని సత్యం, సంగాని మునేంద్ర, ఓలేటి సత్తిబాబు, కొప్పాడి బాలకృష్ణ, మల్లాడి ఆదినారాయణ, ఇసుకపట్ల శ్రీనుబాబు, ఓలేటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం



అమలాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్



జి.వేమవరం పంచాయతీలో పొన్నాడ సతీమణి నీరజను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

వైఎస్సార్ సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం

అమలాపురం టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక 21వ వార్డులో డాక్టర్ శ్రీకాంత్ శనివారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తన తండ్రి విశ్వరూప్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, వంటెద్దు వెంకన్నాయుడు, కురసాల భద్రాజీ, కుడుపూడి భరత్ భూషణ్, వాసర్ల సుబ్బారావు, కల్వకొలను ఉమ తదితరులు పాల్గొన్నారు.

జి.వేమవరంలో..

తాళ్లరేవు: మండలంలోని జి.వేమవరం పంచాయతీ పరిధిలోని మట్లపాలెం, చొల్లంగిపేట గ్రామాల్లో ఎమ్మెల్యే పొన్నాడ సతీమణి నీరజ, కుటుంబ సభ్యులు శనివారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఆమెకు మహిళలు, అభిమానులు హారతులిచ్చి ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో పటవల సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, గ్రామ కమిటీ కన్వీనర్ గండి రామాంజనేయులు, మట్టా లింగమూర్తి, దెయ్యాల సత్తిబాబు, నీలపాల శ్రీను, పినపోతు శ్రీను, పినపోతు స్వామి తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన తాళ్లరేవు, ఇంజరం, జార్జిపేట, జి.వేమవరం, చొల్లంగి తదితర గ్రామ పంచాయతీల్లో జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, రెడ్డిబాబు, గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు రత్స ముత్యాలు, నందికోళ్ల శ్రీమన్నారాయణ, చిట్టూరి చలపతి, కొల్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేశనకుర్రులో...

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రులో మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను, ఎంపీగా రాపాక వరప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఇందుకూరి రంగరాజు, కాశి పరివాజ్ కుమార్, పిన్నంరాజు బాబ్జిరాజు, మోకా రవి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం మండలంలో..

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలో పార్టీ శ్రేణులు శనివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని అనాతవరం, సీహెచ్ గున్నేపల్లి, చినకొత్తలంక, గేదెల్లంక, కర్రివానిరేవు, అన్నంపల్లి, అయినాపురం తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోలా గంగా భవానీ, జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు, కోలా బాబ్జీ, పీటీవీ వర్మ, గొలకోటి ఆంజనేయులు, గొలకోటి రామారావు, గనిశెట్టి కాశీ, కాశి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పురాతన నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన



పురాతన నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శనను తిలకిస్తున్న సంస్కార భారతి ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన పుత్సా కృష్ణ కామేశ్వర్ స్థానిక భూపయ్య అగ్రహారంలోని సంస్కార భారతి ఉపాధ్యక్షుడు కూచిమంచి కృష్ణ ఇంట్లో పురాతన నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన శనివారం సాయంత్రం ఏర్పాటు చేశారు. సంస్కార భారతి వ్యవస్థాపకుడు వాకంకర్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శనను సంస్కార భారతి ప్రతినిధులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో సంస్కార భారతి దక్షిణ మధ్య క్షేత్ర ప్రముఖ్ వేదనభట్ల శేఖర్, సంస్కార భారతి ఉపాధ్యక్షురాలు శ్రీగిరి పద్మావతి, ప్రతినిధులు పేరి లక్ష్మీనరసింహం, శ్రీగిరి గోపాలకృష్ణ, భమిడిపాటి కనకాద్రిశాస్త్రి, శిష్టా శ్రీహరి, గోకరకొండ బలరామకృష్ణ గోవిందం, పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొని వ్యక్తి మృతి

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని జైభీంపేట వద్ద ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు కోరంగి ఎస్‌ఐ ఎస్.రవికుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కాజులూరు గ్రామానికి చెందిన దాసరి లోవరాజు(32), పైడికొండల రామాంజనేయులు అనే మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై అమలాపురం వెళుతుండగా ఎదురుగా వస్తున్న ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొట్టింది. స్థానికులు వారిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా లోవరాజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాదంలో గాయపడిన రామాంజనేయులు చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలింగ్ నిర్వహణపై అవగాహన ఉండాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవవర్ధన రెడ్డి

అమలాపురం రూరల్: సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని ఆర్డీవో అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి జి.కేశవవర్ధన రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అసెంబ్లీ స్థాయి పీవో, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సీవిజిల్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలోని మాస్టర్ ట్రైనీ బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రక్రియలో ఏమైనా అనుమానాలుంటే ఇప్పుడే నివృత్తి చేసుకోవాలన్నారు. పీఓలు, ఏపీఓలకు అన్ని అంశాల పట్ల సమగ్ర అవగాహన ఉన్నప్పుడే, ఓటింగ్ ప్రక్రియ సజావుగా పూర్తవుతుందన్నారు. విధి నిర్వహణలో పారదర్శకంగా, అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. ఓటింగ్ ప్రారంభించే ముందు మాక్ పోలింగ్ అత్యంత కీలకమన్నారు. మాక్ పోలింగ్ నిర్వహించకపోతే ఎన్నిక రద్దయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితులను తప్పులు జరగకూడదని, రీపోల్‌కి ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ జరుగుతున్నప్పుడు పోల్ డే మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్‌లో అవసరమైన వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల శిక్షణల నోడల్ అధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ జి.కనకరాజు, మాస్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకోవాలి

అమలాపురం రూరల్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ఈ నెల 5, 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారి ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 5వ తేదీన ప్రిసైడింగ్ అధికారులు సహాయ ప్రిసైడింగ్ అధికారులకు, 6వ తేదీన పోలీస్ సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులు, 7వ తేదీన ఎన్నికల విధుల్లో పాల్గొనే వీడియో గ్రాఫర్లు, డ్రైవర్లు, సెక్టార్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ సౌలభ్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.